క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు నంద్యాల గుడ్‌డే పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రసూల్ ఆజాద్, కోచ్ నాగార్జునరెడ్డిలు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17, 14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థులు తరుణ్, జయకార్తీక్, చైత్రికరావు, అక్షయ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. నవంబర్ 9 నుంచి 14వ తేదీ వరకు వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న డీపీఓ మంజులవాణి

దొర్నిపాడు: గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని డీపీఓ మంజులవాణి సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయాలకు ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీడీ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు ప్రతి వారంలో మూడు సచివాలయలను తనిఖీ చేయాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లను ప్రతి రెండు వారాలకు ఒకసారి శుభ్రం చేయాలని చెప్పారు. హాజరు విషయంలో సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వీటిపై కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

రైతుల ఆత్మహత్యపై ఆర్డీఓ విచారణ



వివరాలు నమోదు చేసుకుంటున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు

దొర్నిపాడు: మండలంలో ఇద్దరు రైతులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆర్‌డీఓ శ్రీనివాసులు శుక్రవారం విచారణ చేపట్టారు. అర్జునాపురం గ్రామానికి చెందిన కొమ్ము దస్తగిరి, చాకరాజువేముల గ్రామానికి చెందిన కుమ్మరి దస్తగిరి గతంలో ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ఆయన మృతుల కుటుంబ సభ్యులు ఓబుళమ్మ, లక్ష్మీదేవిని విచారించి అప్పులు, సొంత పొలం, కౌలుకు ఎన్ని ఎకరాలు సాగుచేస్తున్నారు, కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ జయప్రసాద్, వీఆర్‌ఓలు రాధమ్మ, రేవనూరు ఉన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు



దర్గా వద్ద ఫాతెహాలు నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: స్థానిక కోట గడ్డ వీధిలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి జెండాలను ఊరేగించి, గంధోత్సవం చేపట్టారు. ఉరుసు సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ఫాతేహాలకు జేసీఎస్ జిల్లాకో-ఆర్డినేటర్ షేక్ బాబులాల్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామ సచివాలయంలో సర్పంచ్ బంగారు షరీఫ్ అధ్యక్షతన మండల వ్యవసాయాధికారి రంగానేతాజీ శుక్రవారం ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు తమ వివరాలను సరిచూసుకొని ఏవైనా తప్పులుంటే సంబంధిత రైతు భరోసా కేంద్రంలో తెలియజేయాలని చెప్పారు. తప్పులు సరిచేసుకునేందుకు ఈ నెల 28వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

జయప్రదం చేయండి

చాగలమర్రి: ఈ నెల 29వ తేదీన గుంటూరులో హక్కుల సాధనకు చేపట్టిన దూదేకుల సింహ గర్జనను జయప్రదం చేయాలని ఏపీ దూదేకుల నూర్‌బాషా సంక్షేమ సంఘం నాయకులు బ్రహ్మయ్య, లాలయ్య కోరారు. సంఘం పట్టణ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్లను విడుదల చేశారు. పీరయ్య, డీఎం షరీఫ్, నాగేషు, ఇమాముల్ ఉన్నారు.



ఉయ్యాలవాడలో ప్రారంభానికి ముస్తాబైన నూతన పీహెచ్‌సీ భవనం

ప్రారంభానికి ముస్తాబు

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన సముదాయం నిర్మాణం పూర్తయింది. శుక్రవారం ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి భవనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయని, వారం రోజుల్లో పూర్తి చేసి ఆరోగ్య శాఖ అధికారులకు భవనాన్ని అప్పగిస్తామన్నారు. ప్రస్తుతం ఉయ్యాలవాడలో ఉన్న 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 1960లో నిర్మించారు. శిథిలావస్థకు చేరినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన భవనానికి రూ.1.80 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి ముస్తాబవుతోంది.

అమరవీరుల త్యాగాలు మరువలేం

ఆళ్లగడ్డ: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేమని డీఎస్పీ వెంకటరామయ్య పేర్కొన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల భాగంగా పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. పోలీసు సిబ్బంది, అధికారులు, స్థానిక యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. శాంతిభద్రత పరిరక్షణకు పోలీసులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు రమేష్‌బాబు, హనుమంతనాయక్, వంశీధర్, ఎస్‌ఐలు ఉన్నారు.



రక్తదానం చేసిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

చాగలమర్రి: మండలంలోని మద్దూరు గ్రామంలో గ్రామ దేవత మద్దూరమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు కైప వెంకటసుబ్బయ్య శర్మ, పుల్లయ్య స్వామి, రామతేజస్వామి, శ్రీనివాసులుస్వామి, మురళీ స్వామి ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులరెడ్డి, మహబూబ్‌షరీఫ్, దక్కన్ రమణారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న వేదపండితులు

మోడల్ కళాశాలగా తీర్చిదిద్దుతాం

శిరివెళ్ల: యర్రగుంట్ల డిగ్రీ కళాశాలను జిల్లాలోనే మోడల్ కళాశాలగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి తెలిపారు. కళాశాలలో రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, స్కిల్ హబ్ సెంటర్‌ను తన కూతురు గంగుల అవంతికతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాడు- నేడు కింద జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మాణం మొదలయిందని, త్వరలో డిగ్రీ కళాశాలకు కూడా ప్రహరీ మంజూరు అవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, బీ.అబ్దుల్ సలాం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, సర్పంచులు అయ్యలూరి సుభహాన్, ప్రసాదరెడ్డి, జింకల నాగన్న, ఉప సర్పంచు ప్రతాపరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు మేర్వ కోటిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

రైతులను ఆదుకుంటున్న వేరుశనగ

నంద్యాల(సెంట్రల్): వర్షాభావ పరిస్థితుల్లో వేరుశనగ ఆరుతడి పంటగా రైతులను ఆదుకుంటోంది. నంద్యాల జిల్లాలోని డోన్, బేతంచర్ల, ప్యాపిలి, కోవెలకుంట్ల, సంజామల, అవుకు, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాల్లో ఈ పంటను అధికంగా సాగు చేస్తారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 15,804 హెక్టార్లకు గాను 9 వేల ఎకరాల దాకా సాగైంది. ప్రస్తుత రబీ సీజన్‌లో మరో 3,351 హెక్టార్లలో సాగు చేయొచ్చనే అంచనాలు ఉన్నాయి. ఖరీఫ్ పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. రబీ సాగు కోసం రైతులు విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. మెట్ట పొలాల్లో వేరుశనగను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ పంట సాగుకు ఇసుకతో కూడిన గరప నేలలు, ఎర్రగరప నేలలు అనుకూలం. మేలైన సస్యరక్షణ చర్యలు చేపడితే వేరుశనగలో అధిక దిగుబడులు సాధించవచ్చని నంద్యాల ఏరువాక కేంద్రం కార్యక్రమాల సమన్వయకర్త డా.సరళమ్మ పేర్కొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

నంద్యాల టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని వైద్యాధికారులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎన్జీవో కాలనీ, జగజ్జననీ నగర్, వైఎస్సార్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. జగజ్జననీ నగర్ ఆరోగ్య కేంద్రంలో నడిగడ్డ వాసులకు, ఎన్‌జీఓ కాలనీ ఆరోగ్య కేంద్రంలో పొన్నపురం కాలనీ ప్రాంత వాసులకు, వైఎస్సార్ నగర్ ఆరోగ్య కేంద్రంలో నందమూరి నగర్ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్జీవో కాలనీ వైద్య శిబిరంలో 811 మందికి వైద్యం అందించామని వారిలో 30 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్ కు రెఫర్ చేశామని వైద్యాధికారి చంద్రకాంత్ తెలిపారు. జగజ్జననీ నగర్ వైద్య శిబిరంలో 518 మందికి వైద్యం అందించామని వారిలో ఏడుగురిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రెఫర్ చేశామని వైద్య అధికారి ప్రియభావన తెలిపారు.



మందలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేసిన వారిని సన్మానిస్తున్న ఎస్‌ఐ

దొర్నిపాడు: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం ఎంతో అవసరం అని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎస్‌ఐ తిరుపాల్ సూచించారు. పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకొని దొర్నిపాడుకు చెందిన మహేంద్ర, మధు, మహేష్, నాగేంద్ర, దేవ్, సాయిప్రియ, హరి, జమాల్ బాషా, గీతాంజలి, లక్ష్మినారయణ, శ్రీను రక్తదానం చేశారు. దీంతో ఎస్‌ఐ శుక్రవారం వారికి ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు.

వాటర్ ట్యాంక్ ఏర్పాటు

రుద్రవరం: మండలంలోని మందలూరు గ్రామంలోని చర్చి ప్రాంగణంలో రూ.70వేలతో వాటర్ ట్యాంక్‌ను నిర్మించినట్లు సర్పంచ్ నిర్మలాదేవి, వైస్ ఎంపీపీ వీరశంకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సొంత నిధులతో ట్యాంక్‌ను నిర్మించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

అనుమతుల్లేని మందులు విక్రయిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ సిబ్బంది

రుద్రవరం: అనుమతుల్లేని పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ నాగరాజు యాదవ్ హెచ్చరించారు. మండలంలోని ఆలమూరులో వెంకటేశ్వర గ్రోమోర్ పురుగు మందుల షాపులో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ దుకాణాల్లోని రికార్డులు, స్టాక్‌ను పరిశీలించగా తేడా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో రూ.4లక్షల విలువజేసే మందులను గుర్తించి సీజ్ చేశామన్నారు. ఎస్‌ఐ హనుమంతప్ప, ఏఓలు రూపస్ రోనాల్డ్, శ్రీకృష్ణ, ఏఈఓ రాజు ఉన్నారు.

మాజీ మంత్రికి ప్రొటోకాల్ తెలియకపోవడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: ప్రొటోకాల్ అంటే ఏంటో తెలియకుండానే మంత్రి పదవి ఎలా నిర్వర్తించారని, ఈ మాత్రం తెలియకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి అఖిల ప్రియపై ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన ఆమె ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఎలా హాజరవుతారని విమర్శించడంపై ఎమ్మెల్యే స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. నా నియోజకవర్గంలోని దొర్నిపాడులో ప్రజా సమస్యల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తనను ఆహ్వానించడం ప్రొటోకాల్‌లో భాగమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారని, ప్రభుత్వ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. రాజకీయం చేయడానికే పంటలు ఎండిపోతున్నాయని అంటున్నారని, మీ పాలన 2014-2019 లో ఏనాడూ పంటలకు నీరు సక్రమంగా అందలేదని, నాడు ఏనాడైనా కాల్వ కట్టమీదకు వచ్చావా అంటూ నిలదీశారు. ప్రస్తుతం తీవ్ర వర్షాభావం వల్ల వర్షాలు లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని గమనించి కాల్వకు నీటిని విడుదల చేయించామని, పంటలన్నింటికీ నీటిని అందించాలనే ఉద్దేశంతో వారబందీ అమలు చేస్తున్నామని చెప్పారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలని, సమస్యలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేసే పద్ధతులకు కాలం చెల్లిందని, ఇప్పటికైనా నిజాయితీగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో మీ రాజకీయాలను పూర్తిగా భూస్థాపితం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు మోహన్‌నాయుడు, శివారెడ్డి, శివరామిరెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత గ్రామోత్సవం



అమ్మవారి పీఠాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని వాసవీ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా పండుగ తర్వాత నిర్వహించే వాసవీ మాత గ్రామోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు మాట్లాడుతూ దసరా తర్వాత వచ్చే ఆదివారం పట్టణ ఆర్యవైశ్యులందరికీ ఊరి విందు కార్యక్రమం, అలాగే అమ్మవారి వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించాలని భావించామని, అయితే శనివారం చంద్ర గ్రహణం కారణంగా పురోహితుల సలహా మేరకు పట్టణంలో శుక్రవారం నాలుగు పీఠాలతో ఊరేగింపు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆదివారం ఉదయం అమ్మవారి వసంతోత్సవం అనంతరం పట్టణ ఆర్యవైశ్యులందరికీ ఊరి విందు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

నేడు ఆలయాల మూసివేత

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 28వ తేదీన చంద్ర గహణం సందర్భంగా పట్టణంలోని ఆలయాలు మూసివేస్తున్నట్లు ఆలయాల ఈఓలు రామాంజనేయ శర్మ, లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ బయటి పేట శ్రీ కోదండ రామస్వామి, శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి, శ్రీ రమాసమేత సత్యనారాయణ స్వామి, మూలసాగరంలోని శ్రీకోదండ రామాలయాలను శనివారం సాయంత్రం 6 గంటల నుంచి మూసివేస్తున్నట్లు చెప్పారు. తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ, అభిషేకాల అనంతరం దర్శనాలు పునఃప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.


యువకులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): దారిన వెళ్లే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఇద్దరు యువకులకు సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి జైలు శిక్ష విధించారని పోలీసులు శుక్రవారం తెలిపారు. సాయిబాబా నగర్ ఏరియాలో రహదారిపై వెళ్తున్న వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న పెద్ద ప్రశాంత్, సుమంత్ ఆచారిని రెండవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా పెద్ద ప్రశాంత్‌కు తొమ్మిది రోజులు, సుమంత్ ఆచారికి ఇరవై రోజుల చొప్పున జైలు శిక్ష విధించారని చెప్పారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

రుద్రవరం: గృహ నిర్మాణాలను వేగంగా నిర్మించుకునేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, హౌసింగ్ డీఈ నాగరాజు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణాలపై ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో 915 మందికి గృహాలు మంజూరయ్యాయని ఇప్పటి వరకు 329 మంది ఇళ్లు పూర్తి చేసుకున్నారన్నారు. మిగిలిన వారు నవంబర్ చివరి నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీఆర్ ఏఈ వెంకటరాముడు, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



శివకార్తీక్‌రెడ్డి

రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన శివకార్తీక్ రెడ్డి అనే విద్యార్థి అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శివలక్ష్మి కుమారుడు శివకార్తీక్ రెడ్డి 9వ తరగతి చదువుతున్నాడు. తోటి విద్యార్థులతో కలిసి యల్లావత్తుల జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లేవాడు. ఈ క్రమంలో భాగంగా పాఠశాలకు అని వెళ్లిడి. కొట్టాల గ్రామం వద్ద పుస్తకాల బ్యాగ్‌ను ముళ్లపొదల్లో పడేసి ఆకతాయి చేష్టలు చేసేవారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి బడికి వెళ్లకుండ ఇలా చేయడం ఏంటని ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెబుతానని మందలించాడు. దీంతో శివకార్తిక్ రెడ్డి గాజులవైపు వెళ్తున్న ఓ మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. సాయంత్రం గడిచినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే సెల్ 9121101171 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

జాబితాపై అనుమానాలుంటే ఆర్బీకేల్లో సంప్రదించండి

నంద్యాల(అర్బన్): ఈ- క్రాప్ నమోదులో వచ్చిన పొరపాట్లను ఈనెల 29 వరకు సవరించుకోవచ్చని, అనుమానాలపై ఆర్బీకేల్లో సంప్రదించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని కానాల, ఊడుమాల్పురం గ్రామాల్లో ఆర్‌బీకేల్లో ప్రదర్శనకు ఉంచిన జాబితాను రైతులతో కలిసి పరిశీలించారు. సర్పంచ్ బావమ్మ, ఏఈఓ మణిమోహన్‌రెడ్డి, వీఏఏ పుష్పలత, సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.



5కే రన్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న పోలీసు అధికారులు

ఉల్లాసంగా 5కే రన్

బొమ్మలసత్రం: సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ 75వ వార్షికోత్సవం సందర్భంగా నంద్యాల పట్టణంలో ఫిట్‌నెస్-75 5కే రన్‌ను జిల్లా అడిషినల్ ఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శరీర ధృఢత్వానికి పరుగు ఎంతో మేలు చేస్తుందని ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో పరుగును ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందికి, సాధారణ పౌరులకు పరుగు పందెం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన పరుగు పందెం పొగాకు గోడౌన్, ఎల్‌కేఆర్ ఫంక్షన్ హాల్ మీదుగా తిరిగి కళాశాల వరకు సాగింది. పోటీలో గెలుపొందిన వారికి వరుసగా రూ.1500, రూ. వెయ్యి, రూ.500 అందజేశారు. పోలీస్ మెన్‌లో వేణుగోపాల్, సుధాకర్, సుదర్శన్, పోలీస్ ఉమెన్‌లో ఖాజాబీ, సబీనా, పద్మావతి, సాధారణ పౌరుల్లో కిషోర్, వెంకటసునీల్, నాని బహుమతులు గెలుచుకోగా వారికి బహుమతులు అందజేశారు. ఏఆర్ డీఎస్పీ రంగముని, నంద్యాల టౌన్ సీఐలు ప్రభాకర్ రెడ్డి, నరసింహులు, రవీంద్ర, దస్తగిరి పాల్గొన్నారు.

తాలూకా యూపీఎస్ పోలీస్‌స్టేషన్ తనిఖీ..

నంద్యాల తాలూకా యూపీఎస్‌ను జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల స్థితిగతులపై ఆరా తీశారు.

నీటిని వృథా చేయొద్దు

రుద్రవరం: తెలుగుగంగ కాల్వల ద్వారా వచ్చే నీటిని వృథా చేయకుండా రైతులు పొదుపుగా వాడుకోవాలని ఆ శాఖ ఎస్ఈ వెంకటరమణయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రం సమీపంలో తెలుగుగంగ కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతినకుండా ప్రభుత్వం వారబందీ పద్ధతిలో సాగునీటిని అందిస్తుందన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, అయితే ఆ నీటిని ఉప ప్రధాన కాల్వలకు తగిన మోతాదులో విడుదల చేసి 500 క్యూసెక్కుల నీటిని గండ్లేరు రిజర్వాయర్‌కు చేరేలా చర్యలు చేపట్టామన్నారు. నవంబర్ 4వరకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఈఈ శంకర్‌రెడ్డి, డీఈఈలు చంద్ర ఓబుళరెడ్డి, శరత్‌కుమార్, ఏఈలు రామశేషు, రాజు, సుబ్బారావు ఉన్నారు.



తెలుగగంగ కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరమణయ్య

సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణ పేదల సొంతింటి కల నెరవేర్చిందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. పట్టణంలోని 10వ వార్డు పరిధిలో కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టిడ్కో ఇళ్లు మంజూరైన లబ్దిదారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి రిజిస్టర్ హక్కు పత్రాలు అందజేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భార్య సారికారెడ్డి, సోదరి అవంతికరెడ్డి హాజరయ్యారు. టిడ్కో ఇళ్లలో చేరిన ప్రతి ఒక్కరికీ అన్ని వసతులు కల్పిస్తామని కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు.



లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

విహారయాత్రలో విషాదం

- రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకులు మృతి

మహానంది: విహారయాత్రలకు మిత్రులంతా కలిసి వచ్చారు. శ్రీశైలంలో మల్లికార్జున స్వామి దర్శనం ముగించుకుని అందరూ మధ్యలో భోజనాలు చేసి సరదాగా కబుర్లు చెప్పుకుని బయల్దేరారు. ఐదు బైకులపై సుమారు పది మంది మహానందికి వస్తుండగా బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామ సమీపంలోని ప్రభాత్ కాలేజీ వద్ద ఎదురుగా వస్తున్న ఓ బైకు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. బండిఆత్మకూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన కరీం, రఫీ, మస్తాన్‌తో పాటు మరికొంత మంది యువకులు విహారయాత్ర నిమిత్తం బైకులపై గురువారం శ్రీశైలం చేరుకున్నారు. అక్కడ దర్శనం ముగించుకుని మహానంది వెళ్తుండగా ప్రభాత్ కాలేజీ సమీపంలో కరీం(22) బైక్.. ఎదురుగా వస్తున్న వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన డేవిడ్(26) బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరి తలలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.



మృతి చెందిన డేవిడ్(ఎర్ర టీషర్టు), కరీం

ఊదిబత్తీల విక్రయ కాంట్రాక్టరుకు జరిమానా

మహానందిలోని ఊదిబత్తీల విక్రయ టెండరుదారుడు రమేష్‌రెడ్డికి జరిమానా విధించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల దసరా నవరాత్రి ఉత్సవాల రోజుల్లో నిబంధనలకు విరుద్ధంగా తన వాహనాలను ముఖద్వారం దాటి రాజగోపురం వరకు తీసుకొచ్చి పూజలను చేయించడం విమర్శలకు దారి తీసింది. దీంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

వైద్య శిబిరం విజయవంతం

శిరివెళ్ల: స్థానిక 4వ సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం విజయవంతమైంది. స్పెషలిస్ట్ డాక్టర్లు 521 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం గ్రామ ముంగిటనే అందేలా జగనన్న చర్యలు చేపట్టారని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు పోష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, సర్పంచు సాలమ్మ, బి.అబ్దుల్ సలాం, ఉప సర్పంచు ఇంతియాజ్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, మండల వైద్యాధికారి విజయకుమార్ పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపీపీ నాయక్ వసీం